సాక్షి చిత్తూరు

మంగళవారం । 29 । ఆగస్టు । 2023



సీఎం జగన్‌కు స్వాగతం, వీడ్కోలు

జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. - 8లో



జింక కొమ్ములు స్వాధీనం

పలమనేరు సమీపంలోని నీళ్లకుంట గ్రామంలో ఓ వ్యక్తి వద్ద జింక కొమ్ములను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	25
తిరుపతి	36	25
తిరుమల	31	21
గూడూరు	37	27
నగరి	36	26

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో జాన్వీకపూర్



శ్రీవారి ఆలయం వెలుపల జాన్వీకపూర్

తిరుమల: తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ నటి జాన్వీకపూర్ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగ నాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం అందించారు. అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అవార్డు ఎంపికకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ చేస్తున్న కమిటీ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తు చేసుకున్న టీచర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సోమవారం చిత్తూరు డీఈఓ కార్యాలయంలో ఎంపిక కమిటీ సభ్యులు డైట్ లెక్చరర్ ప్రభాకర్, రిటైర్డ్ ప్రిన్సిపల్ మునిరత్నం ఇంటర్వ్యూలు చేపట్టారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి దరఖాస్తు చేసుకున్న 11 మంది అభ్యర్థులకు పలు ప్రశ్నలు వేసి వివరాలు సేకరించారు. ప్రక్రియను డీఈఓ కార్యాలయం ఏడీ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ వీజీ రమణ పర్యవేక్షించారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు తొక్కేసిన వరి పంట

పెద్దపంజాణి: మండలంలో తిప్పిరెడ్డిపల్లె వద్ద పంట పొలాలపై ఆదివారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి. గ్రామానికి చెందిన వడ్డి గంగులప్ప అనే రైతుకు చెందిన వరి పంటను తొక్కి నాశనం చేశాయి. అలాగే నాగరాజు అనే రైతు పొలంలో పంటతోపాటు పీవీసీ పైపులను ధ్వంసం చేశాయి. సోమవారం ఉదయం పొలాలను పరిశీలించిన రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వారం రోజులుగా గజరాజుల విధ్వంసం కొనసాగుతూనే ఉందన్నారు. ప్రధానంగా జిట్టంవారిపల్లె, ముదిరెడ్డిపల్లె, పెద్దకాప్పల్లె, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లెలోని పంటలను తీవ్రంగా నష్టపరిచాయని వెల్లడించారు. అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు వెలుపలికి రాకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దెబ్బతిన్న పంటలను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు దొరస్వామి, రవికుమార్ పరిశీలించారు. బాధిత రైతులకు నష్టపరిహారం మంజూరు చేయించేందుకు చర్యలు చేపడతామన్నారు. ట్రాకర్ల సహాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.



నగరిలో ముఖ్యమంత్రి సభకు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు



చిరునవ్వులు చిందిస్తున్న సీఎం వైఎస్ జగన్

వరాలు కురిపిస్తూ.. దీవెనలందిస్తూ..

- జన సంద్రంగా మారిన నగరి
- ముఖ్యమంత్రి సభకు విశేష స్పందన
- చేనేత కార్మికులకు భరోసా కల్పించిన సీఎం వైఎస్ జగన్
- సాగు, తాగునీటి ప్రాజెక్టుల వేగవంతానికి గ్రీన్‌సిగ్నల్
- రూ.14.54 కోట్ల నిర్మాణాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- జగనన్న విద్యాదీవెన కింద 34,388 మంది విద్యార్థులకు లబ్ధి
- 31,180 మంది తల్లుల ఖాతాల్లో రూ.22.01 కోట్లు

నేల ఈనిందా.. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు నగరి జనసంద్రంగా మారిపోయింది. జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో తరలివచ్చిన ప్రజానీకంతో పట్టణం కిక్కిరిసింది. సంక్షేమ సారథిపై అభిమానం ఉప్పొంగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'దీవెన'లకు విద్యార్థుల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది. చేనేత రంగంపై వరాల జల్లు కురిపించడంతో కార్మికుల్లో కృతజ్ఞతాభావం వెల్లివిరిసింది. జయహో జగన్ నినాదం దశదిశలా మార్మోగింది. మా భవిష్యత్ నువ్వే అంటూ జనవాహి ని జేజేలు పలికింది. బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నయా జోష్ నింపింది. రాబోయే సార్వత్రిక సమరంలో తిరుగులేని విజయం తథ్యమనే ధీమా రెట్టింపైంది.



కంప్యూటర్ బటన్ నొక్కి విద్యాదీవెన నిధులు విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వృద్ధ మహిళల ఆనందోత్సాహం



జగనన్నతో సెల్ఫీ తీసుకుంటూ..

సాక్షి, చిత్తూరు/నగరి : నగరిలో సోమవారం పండగ వాతావరణం కనిపించింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల చదువుకు భరోసా కల్పించేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజానీకం ఘనంగా స్వాగతం పలికింది. జగనన్న విద్యాదీవెన పథకం కింద ఈ ఏడాది తొలి త్రైమాసికం నిధుల విడుదలకు నగరి పట్టణం వేదికగా మారడంపై స్థానికుల్లో ఆనందం నింపింది. ముఖ్యమంత్రి కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాల నిధులు విడుదల చేయడంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. ఈ పథకం కింద జిల్లాలోని మొత్తం 34,388 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది. 31,180 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.22,01,37000 జమ అయ్యింది. థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

అభివృద్ధి దిశగా అడుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగరి నియోజకవర్గ అభివృద్ధికి వరాలు కురిపించారు. చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు పవర్‌లూమ్స్ మీద ఎలక్ట్రిసిటీ డ్యూటీ మినహాయిస్తున్నట్టు ప్రకటించారు. గాలేరు నగరి సుజల స్రవంతిని అనుసంధానం చేసే వేణుగోపాల్‌సాగర్, వేపగుంట, అడవికొత్తూరు ప్రాజెక్టులకు సంబంధించి పనులు వేగవంతం చేసేందుకు హామీ ఇచ్చారు. ఇక రేణిగుంట ఎస్వీ షుగర్‌లో 226 రైతు కుటుంబాలకు చెల్లించాల్సి రూ.21.37 కోట్ల బకాయిలు చెల్లించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించడంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు. సంక్షేమ ప్రభుత్వానికే ఎల్లప్పుడూ అండగా ఉంటామని, జగనన్న వెంటే నడుస్తామని నినాదాలు చేశారు.

ఆకట్టుకున్న మంత్రి రోజా ప్రసంగం

మంత్రి ఆర్కే రోజా ప్రసంగం ఆద్యంతం సభికులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రజనీకాంత్ నటించిన జైలర్ చిత్రంలోని 'కొలైక్కాద నాయుం ఇల్లె.. కొర సొల్లాద వాయుం ఇల్లె, ఇదు రెండుం ఇల్లాద ఊరుం ఇల్లె' (మొరగని కుక్క లేదు.. విమర్శించని నోరూ లేదు.. ఈ రెండూ లేని ఊరులేదు) అంటూ చెప్పిన డైలాగ్‌కు ప్రజలు కరతాళ ధ్వనులు చేశారు. చివరగా అర్థమైందా రాజా అని ప్రతిపక్షాలనుద్దేశించి చెప్పడం మరింత అలరించింది. జగనన్నను ఢీకొనేందుకు కలసికట్టుగా కుట్రలు చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై మంత్రి విసిరిన పంచ్‌లకు ప్రజలు కేరింతలు కొట్టారు.

శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

నగరి నియోజకవర్గంలో మొత్తం రూ.14.54 కోట్ల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో రూ.5.4 కోట్ల వ్యయంతో ఆధునికీకరించిన ఏరియా ఆస్పత్రిని ప్రారంభించారు. రూ. 189.60 లక్షలతో నూతనంగా నిర్మించనున్న పోలీస్‌స్టేషన్ , పుత్తూరు మండలం నందిమంగళంలో రూ.725 లక్షలతో నూతనంగా నిర్మించనున్న గురుకుల పాఠశాల భవనాలకు శంకుస్థాపన చేశారు.



చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలి తల్లీ అంటూ విద్యార్థినిని మనసారా ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి







సీఎం వైఎస్ జగన్‌కు చిత్రపటం బహూకరిస్తున్న మంత్రి రోజా, సెల్వమణి దంపతులు, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు, శిలాఫలకం ఆవిష్కరించిన ముఖ్యమంత్రితో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు



అంగవైకల్యాన్ని జయించిన అభిమానం

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు రూరల్: జిల్లాలోని అర్చకుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని దేవదాయ శాఖ ఏసీ ఏకాంబరం తెలిపారు. సోమవారం చిత్తూరులోని జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో ఆయనను అర్చకులు కలిశారు. వివిధ సమస్యలపై విన్నవించారు. దీనిపై ఆయన స్పందిస్తూ జీతభత్యాలు, ధూపదీప పథకం వర్తింపు విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అర్చక సంఘ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ గురుక్కల్ పాల్గొన్నారు.

భావితరాలకు..తేనెలొలుకు తెలుగు

చిత్తూరు రూరల్ : తేనెలొలుకు తెలుగు భాషను భావితరాలకు అందించాలని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం చిత్తూరులోని రెవెన్యూ భవనంలో నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన న్యాయమూర్తి తొలుత గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను గ్రామీణులు సైతం సరళంగా మాట్లాడేలా తీర్చిదిద్దిన ఘనత గిడుగు రామ్మూర్తి పంతులుకు దక్కుతుందన్నారు. మాతృభాష గొప్పదనాన్ని భవిష్యత్ తరాల వారికి, ముఖ్యంగా విద్యార్థులకు బోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలుగు పరిరక్షణను ఉపాధ్యాయులు, భాషాభిమానులు, తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. అనంతరం న్యాయమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కరణం విమల, ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై, సునీల్‌కుమార్, పార్థసారథినాయుడు, రాజరత్నంరెడ్డి, రఘుపతి, గిరిధరన్, హసీనా బేగం, మంజుల దేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి కరుణకుమార్

చంద్రబాబు ఓటమి తథ్యం

గంగాధరనెల్లూరు : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఓటమి తథ్యమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2024 ఎన్నికల్లో కుప్పంలో సైతం చంద్రబాబు ఓడిపోతారని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధిస్తారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధిహామీ, హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిబాబు, రైతుభరోసా అడ్వైజరీ కమిటీ చైర్మన్ బాబురెడ్డి, సర్పంచ్ గోవిందన్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వేలు, స్థానిక నాయకులు కొండారెడ్డి, కేశవరెడ్డి, జయరామిరెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

రేపటి నుంచి క్రీడా ఎంపిక పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని మెసానికల్ మైదానంలో బుధ, గురువారాల్లో జిల్లా స్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు చీఫ్ కోచ్ బాలాజీ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 30న క్రికెట్, ఖోఖో, టెన్నిస్, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, 31న కుస్తీ, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్‌లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్, హాకీ, యోగా, మ్యూజిక్, డ్యాన్స్, షార్ట్‌ప్లే, టేబుల్ టెన్నిస్ క్రీడలకు సంబంధించి ఎంపిక పోటీలు జరగనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే ఉద్యోగులు తమ శాఖ ఐడీ కార్డులు, ఆథరైజేషన్ లెటర్ తీసుకురావాలని సూచించారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించనున్నారు. తెలుగు భాషను సరళీకరించిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఏటా ఆగస్టు 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వేమన, సుమతీ శతకాలు , కవితలు, వ్యాస రచన, వక్తృత్వపు, నృత్య పోటీలు జరిపించి ప్రోత్సాహకాలను అందించనున్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు

చిత్తూరు రూరల్‌: ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఐటీఐ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి కోరారు. డీజిల్‌ మెకానిక్‌ 36, మోటారు మెకానిక్‌– 3, ఎలక్ట్రీషియన్‌–3, వెల్డర్‌–2, పెయింటర్‌–1, ఫిట్టర్‌–1, మొత్తం 46 అప్రెంటిస్‌షిప్‌ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు సెప్టెంబర్‌ 8వ తేదీలోపు www. apprenticeshipindia. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 11వ తేదీన సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని వివరించారు.

31న పీఈటీలకు అవగాహన

నగరి : జిల్లాలోని పీఈటీలు, పీడఅఈలు, ఏపీ ఆర్‌ఎస్‌, ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌, కేజీబీవీఎస్‌లకు ఈ నెల 31వ తేదీన జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు, స్కూల్‌ గేమ్స్‌ సెక్రటరీ సురేష్‌బాబు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ చౌడేపల్లెలోని విజయవాణి రెసిడెన్షియల్‌ పాఠశాలలో ఉదయం 8 గంటలకు పీడీ రామచంద్ర అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో జోనల్‌, ఇంటర్‌ జోనల్‌ క్రీడలపై ఫిట్‌ ఇండియా, ఖేలో ఇండియా యాప్‌లపై అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

బిడ్డను వదిలి వెళ్లిన తల్లి ఘటనపై దర్యాప్తు

చిత్తూరు రూరల్‌: చిత్తూరు జిల్లా ఆస్పత్రిలో ఈ నెల 16వ తేదీన బాత్‌రూంలో ఓ మహిళ ప్రసవించి.. బిడ్డను వదిలి వెళ్లిన ఘటనపై దర్యాప్తు ప్రారంభమైంది. ప్రస్తుతం ఆ పసికందుకు ఎస్‌ఎన్‌సీయూలో చికిత్స అందిస్తున్నారు. ఏపీవీపీ కమిషనర్‌ వెంకటేశ్వర్లు, కలెక్టర్‌ షణ్మోహన్‌ ఆదేశాల మేరకు డీఐఓ రవిరాజు విచారణ చేపట్టారు. ఈ ఘటనలో ఆస్పత్రి సిబ్బంది తప్పిదం లేదని తేల్చారు. సూపరింటెండెంట్‌ అరుణ్‌కుమార్‌ మాట్లాడుతూ తమ ఫిర్యాదు మేరకు పోలీసులు సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారన్నారు. బిడ్డను వదిలి ఆమె వెళ్లిన సమయంలో పనిచేస్తున్న డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందిని లోతుగా విచారించారని తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఆ తల్లి..ఆమెతో పాటు వచ్చిన ఇద్దరు సహాయకుల ఫొటోలు సేకరించినట్లు వివరించారు.



ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్‌కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్‌ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్‌



ఎమ్మెల్యేలు వెంకటేగౌడ, ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్‌ బాబు, ఆర్టీసీ వైస్‌ చైర్మన్‌ విజయానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌, శ్రీశైలం ట్రస్ట్‌ బోర్డు చైర్మన్‌ చక్రపాణిరెడ్డి, ఈడిగ కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ కేజే శాంతి, కలెక్టర్‌ షణ్మోహన్‌, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ

సీఎం జగన్‌కు స్వాగతం, వీడ్కోలు

రేణిగుంట: నగరిలో జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం 9.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి సీఎం చేరుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగ నాగార్జున వచ్చారు. సీఎంకు విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్‌, మంత్రి ఆర్‌కే రోజా, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్‌ శ్రీనివాసులు, ఎమెల్సీ భరత్‌, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, వెంకటేగౌడ, ఎంఎస్‌ బాబు, ఆర్టీసీ వైస్‌ చైర్మన్‌ విజయానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌, శ్రీశైలం ట్రస్ట్‌ బోర్డు చైర్మన్‌ చక్రపాణిరెడ్డి, కేజే కుమార్‌, ఈడిగ కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ కేజే శాంతి, కలెక్టర్‌ షణ్మోహన్‌, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిశాంత్‌రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

ఆత్మీయ వీడ్కోలు

నగరి పర్యటన అనంతరం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి హెలీకాప్టర్‌లో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. గన్నవరం బయలుదేరిన ముఖ్యమంత్రికి పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

అంతర్జాతీయ స్థాయికి స్విమ్స్‌



మాట్లాడుతున్న టీటీడీ జేఈవో సదా భార్గవి

తిరుపతి తుడా: స్విమ్స్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు వైద్యులు కృషి చేయాలని టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు. స్విమ్స్‌ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్‌ ఆర్‌వీ కుమార్‌ పరిచయ కార్యక్రమం సోమవారం స్విమ్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సదా భార్గవి మాట్లాడుతూ స్విమ్స్‌ అభివృద్ధికి ఆధునిక వైద్యానికి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌, వైద్య పరికరాలను సమకూచేందుకు టీటీడీ సిద్ధంగా ఉందన్నారు. వైద్యుల ప్రమోషన్లను సైతం తాము వేగంగా పరిష్కరించామని గుర్తుచేశారు. స్విమ్స్‌ డైరెక్టర్‌ ఆర్‌వీ కుమార్‌ మాట్లాడుతూ తనకు వచ్చిన ఈ అవకాశం భగవంతుని ఆశీస్సులుగా భావిస్తున్నానన్నారు. స్విమ్స్‌ మెడికల్‌ సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రామ్‌, కాలేజీ ఆఫ్‌ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ మాధవి, ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 79,152 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,329 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పారామెడికల్‌ కోర్సులకు 30న ఇంటర్వ్యూలు

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో పారామెడికల్‌ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30న కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్‌ డాక్టర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి పై కోర్సులకు సంబంధించి ప్రవేశాలకు ప్రభుత్వం ఇచ్చిందని, ఇప్పటికే అలైడ్‌ హెల్త్‌ సైన్స్‌, పారా మెడికల్‌ కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రిన్సిపల్‌ చాంబర్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అడ్మిషన్లు పొందే అర్హులు మొత్తం మొదటి ఏడాది ఫీజు రూ.8,150 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రీసర్వే వేగవంతం చేయండి

తిరుపతి అర్బన్‌: రీసర్వే పనులు వేగవంతం చేయాలని జేసీ డీకే బాలాజీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లు, వీఆర్వోలతో రీసర్వేతోపాటు విలేజ్‌ సర్వే డేటా ఎంట్రీ, మ్యూటేషన్‌, అసైన్డ్‌ భూముల వివరాలు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. భూ సర్వేకు సంబంధించి రెండో విడతలో 234 గ్రామాలకుగాను 210 గ్రామాల్లో పూర్తి చేశారన్నారు. జిల్లా సర్వే అధికారి జయరాజ్‌ పాల్గొన్నారు.

మెరుగైన పారిశుద్ధ్యం అమలు చేయాల్సిందే



అధికారులతో సమీక్షిస్తున్న తిరుపతి నగర డిప్యూటీ మేయర్‌ భూమన అభినయ్‌ రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో పారిశుద్ధ్యం మరింత మెరుగ్గా అమలు చేయాలని డిప్యూటీ మేయర్‌ భూమన అభినయ్‌ రెడ్డి స్పష్టం చేశారు. ఆయన సోమవారం మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ హరిత, హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ యువ అన్వేష్‌తో కలిసి క్లీన్‌ తిరుపతిపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా తిరుపతిలో పారిశుద్ధ్యం ఆశించిన స్థాయిలో లేదని అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు మించి మెరుగైన పారిశుద్ధ్యాన్ని అమలు చేసేందుకు నిరంతరం పని చేయాలని సూచించారు. ఎక్కువ రోజులు విధుల్లోకి రాని సిబ్బందిని గుర్తించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని, శాశ్వత పారిశుద్ధ్య ఉద్యోగులు దాదాపు విధులకు హాజరు కావడం లేదన్న ఫిర్యాదులపై కఠినంగా వ్యవహరించాలని కమిషనర్‌ హరితకు సూచించారు. అవసరమైన మేరకు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించుకోవాలని చెప్పారు. పది రోజుల్లో పారిశుద్ధ్య అమలులో సమూల మార్పులు కనిపించాలని హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ యువ అన్వేష్‌కు సూచించారు. నిషేధిత ప్లాస్టిక్‌ ఉత్పత్తులు యధావిధిగా వాడకంలోకి వచ్చాయని, కాలువలో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోతున్నాయన్నారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యత



అర్జీలు స్వీకరిస్తున్న తిరుపతి కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీలు

తిరుపతి అర్బన్‌: స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 99 వినతులు వచ్చినట్టు తెలిపారు. ఇందులో రెవెన్యూశాఖకు సంబంధించి 70 అర్జీలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్పందనకు 55 ఫిర్యాదులు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 55 ఫిర్యాదులు అందినట్లు ఏఎస్పీలు వెంకటరావు, విమలకుమారి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా హాజరై సమస్యలు విన్నవించుకున్నారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద సంఖ్యలో వచ్చినట్టు ఏఎస్పీలు తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



గురుదక్షిణామూర్తి సన్నిధిలో తిరుపతి కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి



ఆలయ ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఇందులో ఎమ్మెల్సీ పీవీవీ సూర్యనారాయణరాజు, తిరుపతి కలెక్టర్‌ కే.వెంకటరమణారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు పాల్గొన్నారు.

నాయుడుపేటలో మూడిళ్లలో లూటీ



నాయుడుపేటలో దొంగలు లూటీ చేసిన ఇళ్లు ఇవే

నాయుడుపేట టౌన్‌: పట్టణంలోని బాలాజీ గార్డెన్‌ వీధిలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక పోలీస్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ ఇళ్లల్లో దొంగలు లూటీ చేశారు. సుమారు 45 సవర్లకు పైగా బంగారు నగలు, మూడు కిలోల వెండి వస్తువులు, రూ.3 లక్షల నగదు అపహరించుకుని వెళ్లారు. బాధితులు, పోలీసుల కథనం.. పట్టణంలోని బాలాజీ గార్డెన్‌ వీధిలో ఉపాధ్యాయుడు లొక్కు శ్రీనివాసులు కొత్తగా రెండో అంతస్తు ఇంటి నిర్మాణం పూర్తిచేసి రెండు రోజుల క్రితం గృహప్రవేశం చేశాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా కింది ఇంటికి తాళం వేసి మిద్దెపై నిద్రిస్తున్నాడు. సోమవారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో నిద్రలేచి కిందకు వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన 30 సవర్లకు పైగా బంగారు నగలు, రెండు కిలోల వెండి వస్తువులు, రూ.76 వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించాడు. అతని ఇంటి సమీపంలో ఉన్న అన్నమేడు హెచ్‌ఎం మధుసూదన్‌రావు భార్యతో కలిసి హైదారాబాద్‌కు వెళ్లారు. ఆ ఇంట్లోకి చొరబడి 17 సవర్ల బంగారు నగలు, కిలో వెండి వస్తువులు దోచుకెళ్లినట్టు గుర్తించారు. అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న కండలేరు పోలీస్‌స్టేషన్‌ హెడ్‌కానిస్టేబుల్‌ పాలూరు చంద్రయ్య భార్యతో కలిసి నెల్లూరులో చదువుకుంటున్న కుమార్తె వద్దకు ఆదివారం వెళ్లి అక్కడే బంధువుల ఇంట్లో ఉన్నారు. ఇదే అదునుగా దొంగలు 6 గ్రాములు బంగారు నగలు, కేజీ వెండి వస్తువులు, రూ.10 వేల నగదు చోరీచేసుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ నరసింహారావు సిబ్బందితో కలిసి చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. ఇంటి గోడలపై ఉన్న కాలి ముద్రలను గుర్తించారు. తిరుపతి జిల్లా నుంచి వచ్చిన క్లూస్‌టీం, ఫింగర్‌ ప్రింట్‌ ఎస్‌ఐ దస్తగిరి తన సిబ్బందితో కలిసి ఆనావాళ్లను గుర్తించారు. ఒకే వీధిలో తాళలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని చోరీ చేయడం స్థానికంగా కలకలం రేపింది.

దొంగలను పట్టుకుంటాం

పట్టణంలో మూడిళ్లలో చోరిలకు పాల్పడిన దొంగలను త్వరగా పట్టుకుంటామని నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌ రెడ్డి పేర్కొన్నారు. చోరీ జరిగిన మూడు ఇళ్లను ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ నాయుడుపేట డివిజన్‌ పరిధిలోని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కువ రోజులు ఇళ్లు వదిలి వెళ్లే క్రమంలో ముందుగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే ఆ ఇళ్ల వద్ద పోలీస్‌ పహారాతో పాటు సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్‌



నిందితుడి అరెస్ట్‌ చూపుతున్న పోలీసులు

కుప్పం : కర్ణాటక మద్యం తరలిస్తున్న సుధాకర్‌ అనే వ్యక్తిని సోమవారం అరెస్ట్‌ చేసినట్లు కుప్పం అర్బన్‌ ఎస్‌ఐ శివకుమార్‌ తెలిపారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నిందితుడి కారులో రూ.56వేల విలువైన 1,056 టెట్రా ప్యాకెట్లు, 48 బీరు సీసాలు పట్టుబడినట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



సురేష్‌ (ఫైల్‌)

కార్వేటినగరం : మండలంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. పుత్తూరుకు చెందిన సురేష్‌(40) సొంత పనుల నిమిత్తం బైక్‌పై కార్వేటినగరం వచ్చాడు. తిరుగుప్రయాణంలో ఉండగా సురేంద్రనగరం సమీపంలోని పెద్ద కనుమ వద్ద బైక్‌ అదుపుతప్పడంతో ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన సురేష్‌ను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వేకువజామున మరణించాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దస్తగిరి తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

– సెల్‌ఫోన్‌కు చార్జింగ్‌ పెడుతుండగా ఘటన



శక్తి మృతదేహం

గుడిపాల : మండలంలోని నారగల్లు దళితవాడకు చెందిన ఓ బాలుడు ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు.. రాజా అనే వ్యక్తి రెండో కుమారుడైన శక్తి(12) ఏఎల్‌పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉన్నాడు. రాత్రి సెల్‌ఫోన్‌కు చార్జింగ్‌ పెడుతుండగా స్విచ్‌బాక్స్‌కు వచ్చే వైరు కొద్దిగా తెగిపోయి ఉండడంతో చేతికి తగిలి షాక్‌కు గురయ్యాడు. కుటుంబీకులు వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చలపతి తెలిపారు.

కుక్కల దాడిలో పొట్టేళ్ల మృతి

చౌడేపల్లి: మండంలోని లద్దిగం గ్రామంలో కె.హేమంత్‌రెడ్డి అనే వ్యక్తికి చెందిన పొట్టేళ్లపై సోమవారం వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో నాలుగు పొట్టేళ్లు తీవ్రంగా గాయపడి మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనలో సుమారు రూ.44 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, విచక్షణారహితంగా మనుషులు, పశువులపై దాడికి తెగబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరాడు.

డాక్యుమెంట్‌ రైటర్ల పెన్‌డౌన్‌

చిత్తూరు కార్పొరేషన్‌: రిజిస్ట్రేషన్‌శాఖలో ప్రైమ్‌ 2.0 సాఫ్ట్‌వేర్‌ (పబ్లిక్‌ డేటా ఎంట్రీ) విధానానికి నిరసనగా మంగళ, బుధవారాల్లో జిల్లావ్యాప్తంగా పెన్‌డౌన్‌ పాటించనున్నట్లు డ్యాకుమెంట్‌ రైటర్ల సంఘం నాయకులు శంకర్‌నారాయణ, రవి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పబ్లిక్‌ డేటా ఎంట్రీ వల్ల పలు తప్పిదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఈ విధానంతో ఏళ్ల తరబడి ఈ వృత్తినే నమ్ముకున్న రైటర్లు మనుగడ కష్టతరంగా మారుతుందని వెల్లడించారు.

జింక కొమ్ములు స్వాధీనం



జింక కొమ్ములు, కత్తులను పరిశీలిస్తున్న గ్రామస్తులు

పలమనేరు : పట్టణ సమీపంలోని నీళ్లకుంట గ్రామంలో అస్లాం అనే వ్యక్తి నుంచి జింక కొమ్ములు, ఆయుధాలను అటవీశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. గ్రామానికి చెందిన అస్లాం రెండు రోజుల క్రితం స్థానికుడైన అప్పి(45), అతడి కుమారుడు భూపతి(20)పై తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. దీంతో గ్రామస్తులు మండిపడుతూ అస్లాం నివసిస్తున్న ఇంటి యజమానిని నిలదీశారు. అస్లాం మరికొందరితో కలిసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని, వెంటనే ఇల్లు ఖాళీ చేయించాలని కోరారు. దీంతో ఇంటి యజమాని వెంటనే స్పందించి అస్లాం ఇల్లు ఖాళీ చేయమని స్పష్టం చేశాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి సామగ్రిని తరలిస్తుండగా ఓ బకెట్‌లో నాలుగు జింక కొమ్ములు, వేట కత్తులు బయటపడ్డాయి. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన నీళ్లకుంటకు చేరుకుని అస్లాం నుంచి జింక కొమ్ములు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులతో కలిసి విచారణ చేపట్టారు.